


**సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె**

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -79 మంగళవారం 25 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం**

**ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య**

**విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి**

**అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన**

**ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుందని వెల్లడి**



**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. **2లో...**




# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**ఏలూరు జిల్లా ముసునూరులో కొత్త మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి**



**ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు**

**రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు**


**రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్**

**ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనం**

**ఏలూరు ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు**మిగతా 2లో...**

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**




**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి **మిగతా 2లో...**

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి**

**బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి**

**శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్**

**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానీటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి,



# ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**ఏపీలో స్థానిక ఎన్నికలంటూ ప్రచారం.. ఎస్ఈసీ హెచ్చరిక**

**సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఫేక్ అని వెల్లడి**

**అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని ప్రజలకు ఎన్నికల సంఘం సూచన**

**100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభం**

**కొత్తగా 33.33 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రతిపాదన**

**ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారమవుతున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని, నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఈ ఫేక్ షెడ్యూల్‌ను ప్రజలు నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠినమైన సైబర్ చట్టాల కింద చర్యలు తీసుకుంటామని **మిగతా 2లో...**






2లో.

# ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

**రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ**

**రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం**

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు**

**జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**




**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నేడు (మంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను **మిగతా 2లో...**

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం**

**జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు**

**(96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి**

**తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు**

**పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు**

**లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా**

2లో.



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.




ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ఃూఅ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**కడపఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):**

జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళు _న్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ



చూపలేదు. చేపట్టిన పనుల్లో కడా నాణ్యత లేదు. కటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కడా దాదాపు తుది దశకు చేరింది. కటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**మొదటిపేజీ తరువాయి**

టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా




అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ అధికారిక చిహ్నాలు, లోగోలను దుర్వినియోగం చేసి కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ నకిలీ షెడ్యూల్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని పునేఠా తెలిపారు. ఈ షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ తమ కార్యాలయానికి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా అధికారిక పత్రికా ప్రకటనల ద్వారా లేదా మీడియా సమావేశాల ద్వారా మాత్రమే వెల్లడిస్తామని, ప్రజలు అనధికారిక వార్తలను ఏమాత్రం పట్టించుకోవద్దని సూచించారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని కోరారు.

మరోవైపు, రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆగస్టు 19న జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల మరో 23 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. త్వరలోనే అధికారికంగా షెడ్యూల్ విడుదల చేస్తామని, అప్పటివరకు వదంతులను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**మొదటిపేజీ తరువాయి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది.

ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# ఫీజు బకాయిల రగడ..

### హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష

ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

**రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్**

రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

**కాకినాడ ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు.




ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు.మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

# నూతన 66వ డివిజన్ కమిటీకి సన్నాహక సమావేశం

**హసన్‌పర్తి/ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** నూతన 66వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. హసన్‌పర్తి నలగట్టుగుట్టలోని మహాలక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ, మహిళా నాయకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు, కార్యకర్తలకు కమిటీల్లో ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు.




**కష్టపడితే గుర్తింపు**

కమిటీలో అవకాశం దక్కని నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరి సేవలను గుర్తించి రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పించేలా డీసీసీ, ఎమ్మెల్యే స్థాయిలో చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీకి మరింత బలం చేకూర్చాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# దళితుల భూమి రెడ్డి కులానికి ఎలా కేటాయించారు?

## ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించాలి -సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ

**హసన్‌పర్తి/ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** దళితులు, నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు కేటాయించడంపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు. ఎల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 246/2/3లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరికి కేటాయించడంపై ఆయన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తాను మాదిగ సామాజిక వర్గానికి చెందిన నిరుపేదనని, ఎలాంటి ఆస్తులు లేని తనతో పాటు అర్హులైన పేదలకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. సర్వే నంబర్ 246/2/3లో సుమారు 5 ఎకరాల 8 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొంత భూమిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన గంగిళ్ల తిరుపతిరెడ్డి,




అంజిరెడ్డికి కేటాయించినట్లు ఆరోపించారు. ప్రభుత్వ భూముల కేటాయింపులో నిబంధనలు, జీవోల్లోని మార్గదర్శకాలను అధికారులు పాటించలేదని ఆయన విమర్శించారు. గతంలో రేణుకుంట్ల సాంబమూర్తి, గట్టయ్యలకు మూడు గుంటల చొప్పున, రేణుకుంట్ల దేవయ్య, మొండయ్యలకు మూడు గుంటల చొప్పున భూమి కేటాయించారని తెలిపారు. అయితే అదే ప్రభుత్వ భూమిలో పెద్ద మొత్తంలో భూమి కొందరి ఆధీనంలో ఉండటంపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

**పేదలకు కేటాయించాలి**

ప్రభుత్వ భూమిని తక్షణమే సర్వే చేసి అర్హులైన నిరుపేదలకు జీవనోపాధి కోసం కేటాయించాలని దుర్గాప్రసాద్ కోరారు. ప్రజా అవసరాలకు భూమి అవసరమైతే దానిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు స్పందించకపోతే ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఉద్యమం చేపడతామని హెచ్చరించారు

# మానసను గొంతు నులిమి చంపా!

## తండ్రే హత్య చేయమని డబ్బులు పంపాడు -ఏసీపీ ఎదుట నిందితుడి సంచలన వాంగ్మూలం

## కారుడిక్కీలో మహిళ మృతదేహం కేసు ఛేదించిన పోలీసులు

**ఎల్కతుర్తి/ఆగస్టు 24(జర్నలిస్ట్ వార్త):** కారుడిక్కీలో మహిళ మృతదేహం లభ్యమైన కేసును ఎల్కతుర్తి పోలీసులు ఛేదించారు. కేసులో నిందితుడు ఏడేల్లి వినోద్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేశారు. మృతురాలు మానసను తానే గొంతు నులిమి హత్య చేసినట్లు నిందితుడు ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఎదుట అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా మానస తండ్రి రాజేశం తన కుమార్తెతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పి హత్య చేయాలని కోరినట్లు, ఖర్చుల కోసం డబ్బులు కూడా పంపినట్లు నిందితుడు చెప్పాడని వెల్లడించారు.

ఈ నెల 21న ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు సమీపంలోని గల్లీలో పార్క్ చేసిన కారులో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన కారును పరిశీలించగా డిక్కీలో సుమారు 35 ఏళ్ల వయసున్న మహిళ మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






**మూడు బృందాలతో గాలింపు**

వరంగల్ సీపీ, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆదేశాలతో పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో ఈ నెల 23న ఎల్కతుర్తి గ్రామ శివారులోని నాగార్జున సీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వినోద్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

**చిన్ననాటి స్నేహం**

విచారణలో నిందితుడు తన పేరు ఏడేల్లి వినోద్‌కుమార్‌రెడ్డి(34), తండ్రి సమ్మిరెడ్డి అని, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి గోదావరిఖనిలో చదువుకున్న అతడికి అదే ప్రాంతానికి చెందిన మానసతో పరిచయం ఉందని తెలిపారు. మానసకు గతంలో రెండు వివాహాలు జరిగాయని, ఇటీవల విడాకులు తీసుకున్నట్లు నిందితుడు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

**పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టడంతో**

ఈ నెల 18న మానస కరీంనగర్‌లోని తన గదికి వచ్చి పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టినట్లు నిందితుడు విచారణలో చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని మానస తండ్రి రాజేశంకు తెలియజేసిన అనంతరం అదే రాత్రి ఆమెను గొంతు నులిమి హత్య చేసినట్లు వినోద్‌కుమార్‌రెడ్డి ఏసీపీ ఎదుట చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని కారులో తరలించి ఎల్కతుర్తిలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు సమీపంలో పార్క్ చేసినట్లు తెలిపారు.

**పోలీసులకు అభినందనలు**

కేసును వేగంగా ఛేదించి నిందితుడిని పట్టుకున్న ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు, కానిస్టేబుళ్లు విఠల్, బక్కయ్యతో పాటు పోలీసు సిబ్బందిని కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. కేసులో నిందితుడి వాంగ్మూలాన్ని ఇతర ఆధారాలతో పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ఫీజు బకాయిలు విడుదలలో సర్కారు విఫలం

## రూ.15 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి -బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్

**కేసముద్రం/ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని



ఆరోపించారు. బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల చదువులు, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారాయని అన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు కేసముద్రం మండల శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థుల పక్షాన ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగోజు నాగేశ్వరచారి, వంగాల కొమ్మాల్‌రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, గాంధీ వెంకట్‌రెడ్డి, మహమ్మద్ ఖాసీం, జుజ్జూరు వీరభద్రచారి, బానోత్ రాము, బానోత్ సంపత్, వల్లందాస్ నగేష్‌తో పాటు మండల, గ్రామ కమిటీల బాధ్యులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీలు, అనుబంధ మోర్చాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాసాని మరియా మృతదేహానికి నమీండ్ల నివాళి



**హసన్‌పర్తి/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మాసాని యాకూబ్ భార్య మాసాని మరియా భౌతికకాయానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమీండ్ల శ్రీనివాస్ సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాసాని యాకూబ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని నమీండ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాసాని సువార్త, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరకుడు రవీందర్, గుగులోత్‌తండా సర్పంచ్ గమ్మి చాకృవాగ్య నాయక్, తండా సర్పంచ్ విట్టు, ఏనుగల్లు మూడేతులతండా కాంటెస్టెడ్ సర్పంచ్ మూడు యాకు నాయక్, గుగులోత్‌తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోత్ చందు, మాజీ సర్పంచ్ మోతిలాల్, భాస్కర్, మాసాని బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి భావితరాలకు పచ్చని భవిష్యత్



**కేసముద్రం/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఉప్పరపల్లి సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి పిలుపునిచ్చారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మానవ మనుగడకు అత్యవసరమైన స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ అందాలంటే మొక్కలు విరివిగా నాటాలన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, పచ్చదనం పెంపుతో వాతావరణాన్ని కొంతమేర చల్లబరచవచ్చున్నారు. అడవులు, వృక్ష సంపదను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వర్షపాతం మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు. రాబోయే తరాలకు ఆస్తిపాస్తులతో పాటు స్వచ్ఛమైన పర్యావరణాన్ని, పచ్చని వృక్ష సంపదను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించి చెట్లుగా పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆవుల ఐలయ్య, వార్డు సభ్యులు జెనిగల అనిల్‌కుమార్, కంచ రాజుకుమార్, తండ సంపత్‌కుమార్, మంద ప్రవీణ్, సాంకేతిక సహాయకుడు మధుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ మంచాల కుమార్, వి.బి.జి. రామ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాలి

## విద్యార్థులతో కలిసి టీఆర్ఎస్ ర్యాలీ



**కేసముద్రం/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** డిప్లొమా పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న జీవో నంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ బోడ అనిల్‌కుమార్ నాయక్ డిమాండ్ చేశారు. కేసముద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి గాంధీ విగ్రహం వరకు సోమవారం విద్యార్థులతో కలిసి టీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా అనిల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థుల హక్కులను కాలరాసేలా ఉన్న జీవో 97ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా టీఆర్ఎస్ శ్రేణులు ఉద్యమిస్తాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి జీవోను రద్దు చేయకుంటే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**గాయపడిన విద్యార్థికి పరామర్శ:** కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో గాయపడిన పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి జాతోతు రాజేష్‌ను అనిల్‌కుమార్ నాయక్ పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హసన్‌పర్తి మండలంలో ప్రజావాణికి ఐదు దరఖాస్తులు

**హసన్‌పర్తి/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి నాలుగు, హౌసింగ్‌కు సంబంధించి ఒక దరఖాస్తు. మొత్తం ఐదు దరఖాస్తులు ప్రజావాణికి వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమానికి మండల స్థాయి వివిధ శాఖలకు చెందిన 24 మంది అధికారులు హాజరైనట్లు ఎంపీడీవో వెల్లడించారు.

# సర్పంచుల సమస్యలపై పోరాటం

**ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌లను కలిసిన రవినాయక్**





**కేసముద్రం/ ఆగస్టు 23 (జర్నలిస్ట్ వార్త);**తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వాంకుడోత్ రవినాయక్ ఆదివారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు సర్పంచులు, నాయకులతో కలిసి వెళ్లిన రవినాయక్ వారికి శాలువాలు కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు, అభివృద్ధి పనులు, సర్పంచుల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సర్పంచులను సమన్వయం చేసుకుని వారి హక్కుల సాధన కోసం సంఘం తరఫున ఉద్యమిస్తామని పేర్కొన్నారు.సర్పంచుల సమస్యల పరిష్కారానికి నాయకుల సహకారం కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరమ్ పగ్గాలు పావనికి!

**మండల అధ్యక్షురాలిగా కుల్లా పావని యాకాంతం ఎంపిక**





**వర్ధన్నపేట/ఆగస్టు 24(జర్నలిస్ట్ వార్త)::** మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలిగా వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచ్ కుల్లా పావని యాకాంతం ఎంపికయ్యారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ఆమెను అధ్యక్షురాలిగా ప్రకటించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న తెలిపారు. సర్పంచుల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధిలో సమన్వయంతో ముందుకు సాగాల్సిన బాధ్యతను పావనికి అప్పగించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పావనికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మెరుగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెషర్స్‌కు ఘన స్వాగతం




**కేసముద్రం/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త);**
కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఆధ్వర్యంలో సోమవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పరిమి నవీన్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి కళాశాల జీవితంలోకి అడుగుపెట్టడం విద్యార్థుల జీవితంలో కీలక మలుపు అన్నారు. కళాశాలలో లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కలలు కనండి.వాటిని లక్ష్యాలుగా మార్చుకోండి. క్రమశిక్షణతో కష్టపడి సాధించండి అని విద్యార్థులకు పిలుపునిచ్చారు.మార్కులతో పాటు మంచి ఆలోచన, నడవడిక, సమయపాలన, క్రమశిక్షణ, ఇతరులను గౌరవించడం కూడా విద్యార్థి జీవితంలో ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారే కాకుండా భవిష్యత్తుకు మార్గనిర్దేశకులని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో దుర్గాప్రసాద్, కృష్ణ నాయక్, రమేష్, శ్రీదేవి, శ్వేత, విజయకుమారి, కంప్యూటర్ ఆపరేటర్ రమ్య, బిందు, హెల్త్‌కేర్ సిబ్బంది ప్రవళిక, అరుణ్‌భాయ్, సోమయ్య, నరసయ్య, యాకయ్య, పార్థసారథి, వేదప్రకాశ్, చంద్రశేఖర్, చంద్రమోహన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు బీమాపై సవతి తల్లి ప్రేమ వద్దు.. కొనసాగించాలి

**ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రైతు రక్షణ సమితి**



**ఎల్కతుర్తి/ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త)::** రైతు బీమా పథకంపై రైతుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం వెంటనే నివృత్తి చేయాలని కోరుతూ తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు బీమా పథకాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా నిరంతరాయంగా కొనసాగించాలని వారు కోరారు.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ మాట్లాడుతూ రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకంపై నెలకొన్న సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని కోరారు. పథకాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూ అర్హులైన రైతులందరికీ బీమా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు మాట్లాడుతూ రైతు కుటుంబానికి ప్రధాన ఆధారమైన వ్యక్తి అనుకోని ప్రమాదానికి గురైనప్పుడు రైతు బీమా ఆ కుటుంబానికి ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. రైతు బీమా విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బీమా క్లెయిమ్‌లను సైతం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.రైతు బీమా పథకం విషయంలో ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చౌల రామారావు, సుక్కినే సుధాకర్‌రావు, అంబిరి శ్రీనివాస్, సురాబు బాపూరావు, వాంకే రాజు, మాధవరావు, బిక్షపతి, ఎర్రబెల్లి రవీందర్, గుండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్తుకు కరాటే బాట.. పాశం దేవయ్యకు ఘన సన్మానం

**1994-95 పదో తరగతి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనంలో ఘన సత్కారం**





**హసన్‌పర్తి/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త);**
199495 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పాశం దేవయ్య బుడోకాన్ కరాటే ఇంటర్నేషనల్ వరల్డ్ మాస్టర్‌గా ఎదిగి పిల్లలకు కరాటే విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుండటం తమకు గర్వకారణమని ఆయన తోటి విద్యార్థులు అన్నారు. తాటికాయల రోడ్డులోని విహంగ రిసార్ట్‌లో నిర్వహించిన 199495 పదో తరగతి బ్యాచ్ గెట్‌టుగెదర్‌లో పాశం దేవయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ ఒకప్పుడు తమతో కలిసి చదువుకున్న దేవయ్య కరాటే రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. తాము పెద్దగా తెలియని కరాటే వంటి విద్యను నేర్చుకుని, దానిని పిల్లలకు నేర్పిస్తూ వారి ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, భవిష్యత్తుకు ఉపయోగపడేలా కృషి చేస్తున్నారని కొనియాడారు. పిల్లలకు విద్యతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు అవసరమని, ఆ దిశగా దేవయ్య చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు.
పదో తరగతి చదువు పూర్తయి ఏళ్లు గడిచినా తమ స్నేహబంధాన్ని కొనసాగిస్తూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వివిధ ఉద్యోగాలు, చేతివృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పాశం దేవయ్యను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో లక్ష్మీ గణపతి పరపతి సంఘం అధ్యక్షుడు దుబ్బాల రాజయ్య, ప్రధాన కార్యదర్శి గొట్టెముక్కుల నరసింహచారి, కోశాధికారి వంగ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వేమునూరు శ్రీనివాస్, మర్రి కుక్కల నరేందర్‌తో పాటు పలువురు ఆహ్వానితులు, 199495 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల గోడు వినేందుకు.. ధర్మసాగర్‌లో ప్రజావాణి

**10 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు**




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త);** ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ధర్మసాగర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 6, ఎంపీవోకు 3, వ్యవసాయ శాఖకు ఒక దరఖాస్తు చొప్పున మొత్తం 10 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. భూ సమస్యలు, గ్రామ పంచాయతీలకు సంబంధించిన అంశాలు, వ్యవసాయ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ధర్మసాగర్ మండల తహసీల్దార్ బావ్‌సింగ్ తెలిపారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.ప్రజావాణికి వచ్చిన ప్రతి వినతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 15 రోజుల్లో అంబాసత్రం భూమిపై స్పష్టత



**కొత్తగూడెం/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త);**
అంబాసత్రం భూమి సమస్యపై 15 రోజుల్లో ప్రాథమిక స్పష్టత వచ్చేలా సమగ్ర సర్వే చేపట్టాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ అధికారులను ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి పంచాయతీ పరిధిలోని కూనారంలో సోమవారం ఆయన భూ సమస్యలను పరిశీలించి, గిరిజనులు, అధికారులతో ప్రజావిచారణ నిర్వహించారు.అటవీ, రెవెన్యూ రికార్డులు, పాత సర్వేలు, జాయింట్ సర్వే వివరాలను పరిశీలించి వాస్తవాలను తేల్చాలని సూచించారు. గతంలో 250 ఎకరాలకు పైగా అంబాసత్రం భూమి ఉన్నట్లు పేర్కొన్న నేపథ్యంలో ప్రస్తుతం రికార్డుల్లో స్పష్టత లేకపోవడానికి కారణాలను గుర్తించాలన్నారు. ఓవర్‌ల్యాప్ ప్రాంతాలను మరోసారి సర్వే చేసి, సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు.గిరిజనుల భూ హక్కులను కాపాడడంతోపాటు అటవీ సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని హుస్సేన్ సూచించారు. కూనారం భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. జిల్లాలోని ఇతర అటవీరెవెన్యూ భూ సమస్యలపైనా జాయింట్ సర్వేలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, ఐటీడీఏ పీవో రాహుల్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో జానారెడ్డి, బీఎల్ఆర్



**మిర్యాలగూడ/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):**
మిర్యాలగూడ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన పలు వివాహాది శుభకార్యాలకు మాజీ సీఎల్పీ నేత, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన శుభకార్యాలకు హాజరైన జానారెడ్డి, బీఎల్ఆర్ దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కూలిన పాఠశాల కాంపౌండ్ గోడ



**ధర్మసాగర్/ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త);** ధర్మసాగర్ మండల కేంద్రంలోని పెద్దబాడి బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్ గోడ వర్షాలకు కూలిపోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోడ బలహీనపడటంతో ఓ వైపు పూర్తిగా నేలమట్టమైంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.పాఠశాల ఆవరణకు రక్షణ లేకపోవడంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లోకి బయటి వ్యక్తులు, పశువులు ప్రవేశించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కూలిన గోడ స్థానంలో నూతన కాంపౌండ్ గోడ నిర్మించాలని, మిగిలిన గోడల స్థితిగతులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన మండల కమిటీలు ఏకగ్రీవం







**వర్ధన్నపేట/ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వర్ధన్నపేట మండల కేంద్రంలోని తక్షశిల కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మండల సదస్సులో నూతన మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంఎస్‌పీ జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనందరావు మాదిగ ముఖ్య అతిథిగా, ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కట్ల రాజశేఖర్ మాదిగ విశిష్ట అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలోని ఉద్యమ ప్రస్థానం, ఎంఆర్‌పీఎస్ సాధించిన సంక్షేమ ఫలితాలు, మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, సంత్ రవిదాస్, పెరియార్, బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను వివరించారు. అంటరానితనం నిర్మూలన, పీడిత వర్గాల హక్కుల సాధన కోసం ప్రతి మాదిగ బిడ్డ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.


**నూతన ఎంఆర్‌పీఎస్ కమిటీ**
అధ్యక్షుడిగా చాడ కరుణాకర్ మాదిగ, అధికార ప్రతినిధిగా సీనపెల్లి రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా బిర్రు ప్రభాకర్ మాదిగ, కందిక చంద్రమౌళి మాదిగ, ఉపాధ్యక్షుడిగా ఎలికట్టే అజయ్ మాదిగ, కార్యదర్శిగా సిలువేరు రాజు మాదిగ ఎన్నికయ్యారు.

**నూతన ఎంఎస్‌పీ కమిటీ**
అధ్యక్షుడిగా ముత్యాల మల్లేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా కలకోట్ల రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మరుపట్ల మస్తాన్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా జోగు రవి మాదిగ, కార్యదర్శిగా ముత్యాల సులేందర్, సహాయక కార్యదర్శిగా సీనపెల్లి రవి మాదిగ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ చంద్రయ్య మాదిగతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాగునీటికి బదులు మురికినీరు

## స్నేహ కాలనీలో ప్రజల అవస్థలు.. అధికారులకు ఫిర్యాదు






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 24 ((జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండల కేంద్రంలోని స్నేహ కాలనీలో తాగునీటికి బదులు మురికినీరు సరఫరా అవుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తున్న నీరు రోజుల తరబడి కలుషితంగా వస్తుండటంతో తాగేందుకు, ఇతర అవసరాలకు వినియోగించలేని పరిస్థితి నెలకొంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కలుషిత నీటిని వినియోగించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వార్డు సభ్యుడు గంగారపు శ్యామ్, స్థానికుడు కొట్టే పుష్పరాజు తెలిపారు. ఇప్పటికే పలువురు వివిధ అనారోగ్య సమస్యలు, చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాగునీటి సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజావాణిలో వినతి**

కాలనీవాసుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల స్థాయి ప్రజావాణిలో ఎంపీడీవోకు గ్రీవెన్స్ సెల్ ద్వారా వినతిపత్రం అందజేశారు. వెంటనే నీటి సరఫరా పైపులైన్లను పరిశీలించి, కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్నేహ కాలనీకి చెందిన పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 1లోగా సాగునీరు ఇవ్వాలి



**తల్లాడ/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల రైతులకు సెప్టెంబరు 1లోగా సిరిపురం మేజర్ కాలువ ద్వారా సీతారామ సాగర్ జలాలను అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయకుంటే రైతులతో కలిసి ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.అన్నారుగూడెంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన హయాంలో సుమారు రూ.10 వేల కోట్లు వెచ్చించి భూసేకరణ, మోటార్లు, పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వంటి పనులు చేపట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు.

**11,500 ఎకరాలకు ప్రయోజనం**


సిరిపురం మేజర్ కాలువ ద్వారా తల్లాడ మండలంలో సుమారు 11,500 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని సండ్ర తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా నీరు అందుబాటులో ఉన్నా. మండల రైతులకు సాగునీరు అందకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.
రైతులతో కలిసి ఆందోళనకు సిద్ధమైన నేపథ్యంలో కొత్తగూడెం సీఈతో మాట్లాడగా సెప్టెంబరు 1లోగా సిరిపురం మేజర్ కాలువ ద్వారా తల్లాడ మండలానికి నీరు అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ హామీ అమలు కాకుంటే సెప్టెంబరు 2 లేదా 3న రైతులతో కలిసి ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

**హామీల అమలులో విఫలం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సెప్టెంబరు 2 నాటికి 1,000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల హామీల్లో అనేకం అమలు కాలేదని సండ్ర విమర్శించారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, రూ.4 వేల పెన్షన్, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం తదితర హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబరు 2న తల్లాడలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర వర్గాలు నిర్వహించే ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుందని తెలిపారు.

# నకిలీ ఆర్ఓఆర్ పత్రాల గుట్టు రట్టు చేయాలి

## కోరపల్లి భూ వివాదంపై కలెక్టర్‌కు బోయిని లావణ్య ఫిర్యాదు




**జమ్మికుంట/ ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** కోరపల్లి భూ వివాదంలో నకిలీ ఆర్.ఓ.ఆర్ పత్రాలు సృష్టించి.రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి. బాధ్యులపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వెంకటేశ్వరపల్లికి చెందిన బోయిని లావణ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
కోరపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 553/ఎలో 4-32 గుంటల భూమిని తాను కొనుగోలు చేశానని లావణ్య తెలిపారు. తన పేరుపై మ్యూటేషన్ కోసం ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్నా దరఖాస్తు పెండింగ్‌లోనే ఉందన్నారు. ఇదే భూమిని ఇతరుల భూములతో కలిపి కాజేసేందుకు గిరబోయిన శ్రీనివాస్, గిరబోయిన కొమురయ్య పేర్లతో నకిలీ ఆర్.ఓ.ఆర్ పత్రాలు సృష్టించారని ఆరోపించారు.

**ఆ అధికారి అప్పట్లో అక్కడ లేరట!**

ఆర్.ఓ.ఆర్./703/2011, 13(బి), 13(సి) పత్రాలపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరగా అనేక అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయని లావణ్య పేర్కొన్నారు. 2011 సెప్టెంబర్ 5న జారీ చేసినట్లు ఉన్న పత్రంపై తహశీల్దార్ కె. భాస్కర్‌రావు సంతకం ఉన్నప్పటికీ.ఆ సమయంలో ఆయన జమ్మికుంట తహశీల్దార్‌గా పనిచేయలేదని తెలిపారు. అప్పట్లో జి. శంకరయ్య తహశీల్దార్‌గా విధులు నిర్వహించినట్లు రికార్డులు చెబుతున్నాయని పేర్కొన్నారు.

**రికార్డుల్లోనూ చేతివాటం?**

కోరపల్లి పహాణీ, 1-బి రికార్డుల్లో మార్పులు, చేర్పులు జరిగినట్లు అనుమానాలున్నాయని లావణ్య ఆరోపించారు. అసలు రెవెన్యూ రికార్డులను స్వాధీనం చేసుకుని శాస్త్రీయంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.
గతంలోనూ ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదులు చేసినా సమగ్ర విచారణ జరగలేదని ఆమె తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. హైకోర్టు పరిణామాల నేపథ్యంలో జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో గిరబోయిన శ్రీనివాస్, గిరబోయిన కొమురయ్య తదితరులపై ఎఫ్ఐఆర్ నంబర్ 299/2026, జూలై 22న కేసు నమోదైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
నకిలీ పత్రాలను రద్దు చేసి.. రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేయాలని, ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారితో పాటు బాధ్యత వహించాల్సిన అధికారుల పాత్రపైనా విచారణ జరిపించాలని లావణ్య డిమాండ్ చేశారు. ఫిర్యాదు ప్రతులను కరీంనగర్ పోలీస్ కమిషనర్, హుజురాబాద్ ఆర్డీవో, ఏసీపీ, జమ్మికుంట తహశీల్దార్, జమ్మికుంట టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు అందజేశారు.

# ఎస్‌జీఎఫ్ఐ జోన్ క్రీడలకు సమష్టి సహకారం అందించాలి

## మండల స్థాయి పోటీలను విజయవంతం చేయాలి ఎంఈఓ కాలేరు యాదగిరి




**కేసముద్రం/ఆగస్టు 24 (జర్నలిస్ట్ వార్త):** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాణ్యమైన క్రీడా శిక్షణ అందించి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని కేసముద్రం మండల విద్యాధికారి కాలేరు యాదగిరి సూచించారు.సోమవారం కేసముద్రం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎస్‌జీఎఫ్ఐ నెల్లికుదురు జోన్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాలకు చెందిన క్రీడా ఉపాధ్యాయులు సమావేశంలో పాల్గొన్నారు. ఎంఈఓ కాలేరు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి నెల్లికుదురు ఎంఈఓ రాందాస్, ఇనుగుర్తి ఎంఈఓ వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తొలుత మూడు మండలాల్లో మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించి, అనంతరం ఎంపికైన క్రీడాకారులతో జోనల్ స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడా పోటీలను సమష్టి సహకారంతో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, నెల్లికుదురు జోన్ సెక్రెటరీ దామల్ల విజయచందర్, సీహెచ్. ఐలయ్య, ఎండీ. ఇమామ్, ప్రణయ్, రవి, పద్మ, లలిత, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వెల్ఫేర్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు




**హసన్‌పర్తి/ ఆగస్టు 24(జర్నలిస్ట్ వార్త):** ఎస్సీ సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సోమవారం హైదరాబాద్‌లోని శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన ఎస్సీ వెల్ఫేర్ కమిటీ ప్రిలిమినరీ సమావేశానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరయ్యారు. కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండి ప్రకాష్, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు తదితరులు పాల్గొన్నారు.ం

# జనాభా లెక్కలతో పాటు బీసీ కులగణన చేపట్టాలి



**వర్ధన్నపేట/ఆగస్టు 24(జర్నలిస్ట్ వార్త):** జనాభా లెక్కలతో పాటు బీసీ కులగణన చేపట్టి, జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు అన్ని రంగాల్లో వాటా కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. ఇల్లందలో పోశాల మధుకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు సామాజిక న్యాయం దక్కాలంటే కులగణన తప్పనిసరన్నారు.అనంతరం ఇల్లంద గ్రామ బీసీ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పెద్దూరి నాగరాజు, బొచ్చు యాదగిరి, బొడ్డుపెల్లి సాయిలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాషబోయిన ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడిగా పోశాల మధుకర్, ఉపాధ్యక్షులుగా మునికుంట్ల సూరి, నాంపల్లి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా రాయబారపు బుచ్చిబాబు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సంగినేని భీమరాజు, మునికుంట్ల బిక్షపతి, ఎలిశాల రాజేష్, కోశాధికారిగా పిట్టల భాస్కర్, సలహాదారులుగా నాంపల్లి వెంకన్న, పోశాల సురేష్, బొద్దున సాంబయ్య, మీడియా ఇన్‌చార్జిగా భైరి శ్రీనివాస్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో బొడ్డుపెల్లి శ్రీకాంత్, మునికుంట్ల శ్రీనివాస్, భేతి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో గుర్తుతెలియని యాచకుడు మృతి



**జమ్మికుంట/ఆగస్టు 24 (జర్నలిస్ వార్త):** జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి వివరాలు, స్వస్థలం తదితర వివరాలు తెలియరాలేదు.విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వార్డు సభ్యుడు నల్లగాశ హరీష్ జమ్మికుంట అంబులెన్స్ నిర్వాహకుడు శేఖర్‌కు సమాచారం అందించారు. దీంతో శేఖర్ వెంటనే స్పందించి అంబులెన్స్‌లో మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ మార్చురీకి తరలించారు.మృతుడి వివరాలు, బంధువుల ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. సమాచారం అందిన వెంటనే స్పందించి మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు సహకరించిన అంబులెన్స్ శేఖర్‌ను స్థానికులు అభినందించారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్‌కు గట్టి దెబ్బ



**జమ్మికుంట/ఆగస్టు 24 (జర్నలిస్ వార్త):** హుజురాబాద్ నియోజకవర్గ జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే కాంగ్రెస్ పార్టీ తీవ్ర రాజకీయ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న హెచ్చరించారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిష్కరించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు కేటాయించిన నివేశన స్థలాల విషయంలో కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టును ఆశ్రయించడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడిగా స్వామిరెడ్డితో పార్టీ నాయకత్వం చర్చించి సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం చూపాలని సూచించారు.ఇళ్ల స్థలాలు వస్తాయన్న నమ్మకంతో పలువురు జర్నలిస్టులు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారని, ప్రస్తుతం నెలకొన్న పరిణామాలతో వారు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంకన్న పేర్కొన్నారు. సమస్యను నాన్చడం వల్ల పరిస్థితి మరింత జఠిలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని జర్నలిస్టుల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సంబంధిత వర్గాలతో చర్చించి జర్నలిస్టులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలనే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకత్వం కళ్లు తెరిచి జర్నలిస్టుల సమస్యను పరిష్కరించకపోతే హుజురాబాద్‌లో పార్టీకి రాజకీయంగా తీవ్ర నష్టం తప్పదని వెంకన్న ఘాటుగా హెచ్చరించారు.

# సీఎంను కలిసిన కడియం కావ్య, శ్రీహరి

### వరంగల్, స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధిపై చర్చ



**ధర్మసాగర్/ హనుమకొండ బ్యూరోఆగస్టు 24 (జర్నలిస్ వార్త):**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల అభివృద్ధి అంశాలపై సీఎంతో చర్చించారు.వరంగల్ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన కీలక అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, పెండింగ్ సమస్యల పరిష్కారం, వివిధ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు అంశాలను ఎంపీ కడియం కావ్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు, పెండింగ్ పనులు, ప్రభుత్వ పథకాల అమలు, నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎంతో చర్చించారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు.వరంగల్ పార్లమెంట్, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు.

# నక్కను కాపాడిన అటవీశాఖ రెస్క్యూ బృందం





**భీమదేవరపల్లి/ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):** ఆహారం కోసం సంచరిస్తూ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన నక్కను అటవీశాఖ సిబ్బంది సురక్షితంగా రక్షించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని మంగళపల్లిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక రైతు తన వ్యవసాయ బావిలో నక్క పడిన విషయాన్ని గుర్తించి వెంటనే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన ఆధ్వర్యంలోని హనుమకొండ రేంజ్ ఎనిమల్ రెస్క్యూ బృందం వెంటనే అక్కడికి చేరుకుంది. బావిలోకి దిగి నక్కను అత్యంత జాగ్రత్తగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం నక్కకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన సంరక్షణ కోసం వరంగల్‌లోని జువాలజికల్ పార్క్‌కు తరలించారు. సకాలంలో స్పందించి సమాచారం అందించిన రైతును, చాకచక్యంగా నక్కను రక్షించిన అటవీశాఖ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

# సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

### వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే




**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):**
: దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికే రెండో, నాలుగో శనివారం సెలవులు ఇస్తున్నారు. మరో రెండు సెలవులు ఇస్తే అలా నెలలో ఐదురోజుల పనిదినం అమలవుతుంది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే.. అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. సమావేశంలో బ్యాంక్ యూనియన్ల సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

# సారంపల్లి మృతి పట్ల కేసీఆర్ సంతాపం

**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):**
అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సారంపల్లి మల్లారెడ్డి తన జీవితకాలమంతా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నిబద్ధతతో పోరాటం చేసిన గొప్ప రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కొనియాడారు. ఆయన మరణం భారత రైతాంగ పోరాటాలకు తీరని లోటని పేర్కొన్నారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పశువైద్యశాల ఉంది.. వైద్యుడు లేడు!

## సీజనల్ వ్యాధులతో పశువులు అల్లాడుతున్నా పట్టించుకునేవారు కరువు

### తిమ్మరాయినిపాడు మినీ పశువుల దవాఖానలో దుస్థితి




**నర్సంపేట, ఆగస్టు 24 (జర్నలిస్టు వార్త):**
పశువులకు వ్యాధులు వస్తే వైద్యం చేయించుకునేందుకు దవాఖానకు తీసుకొస్తే. అక్కడ వైద్యుడే కనిపించకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపాడు గ్రామంలోని మినీ పశువుల దవాఖాన పరిస్థితి ఇలా మారింది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ పశువులు అనారోగ్యానికి గురవుతున్నా సకాలంలో వైద్యం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విధులకు దూరంగా.. ఫోన్‌లో నిర్లక్ష్య సమాధానం**

పశువైద్యుడు శ్రావణ్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వైద్య సేవల కోసం సంప్రదించగా తాను సెలవులో ఉన్నానని సమాధానం ఇచ్చారని తెలిపారు. త్వరలోనే బదిలీ అవుతానంటూ, ఏం చేసుకుంటావో చేసుకో

అని నిర్లక్ష్యంగా మాట్లాడి ఫోన్ పెట్టేశారని రైతులు వాపోతున్నారు. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో పశువులను ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**అధ్వానంగా దవాఖాన. శిథిలావస్థలో స్టాండ్**

దవాఖాన పరిసరాలు కూడా నిర్వహణ లోపానికి అద్దం పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. సిమెంట్ బస్తాలు అక్కడక్కడా పేరుకుపోయి ఉండటంతో పాటు, పశువులను కట్టేందుకు ఏర్పాటు చేసిన స్టాండ్ పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. పశువులకు అవసరమైన టీకాలు సైతం సక్రమంగా వేయడం లేదని ఆరోపించారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడం వల్ల వ్యాధులు ముదిరి పశువులను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మరాయినిపాడు మినీ పశువుల దవాఖానలో వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

### కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

### సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్ -మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్

**మెదక్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ



కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్

మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# నకిలీ డీఎస్పీగా ప్రజలకు టోపీ

**రూ.1.20 కోట్లు వసూళ్లు**

**వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):**
నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ




క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నారా, అతడి మోసాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అరెస్ట్ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# మాట తప్పారంటూ కేంద్రంపై సీజేపీ ఆగ్రహం..

**హైదరాబాద్,ఆగస్టు24 (జర్నలిస్ట్ వార్త):**
కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరోసారి ఆందోళన బాట పట్టాలని నిర్ణయించింది. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నీట్ పరీక్షల నేపథ్యంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలు, పోలీసుల వేధింపులకు గురైన బాధితులతో కలిసి ఈ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించింది.

ఈ నిరసన ర్యాలీ సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుండి ఢిల్లీలోని నూతన పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు కొనసాగనుంది. జూలై 25న ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని తాము దేశవ్యాప్త



నిరసనలను విరమించుకున్నామని, అయితే ఇప్పుడు ప్రభుత్వం మాట తప్పిందని సీజేపీ ఆరోపించింది. ఇది యువతను, బాధితుల కుటుంబాలను వంచించడమేనని పార్టీ తన ప్రకటనలో పేర్కొంది. తమ సహనాన్ని బలహీనతగా భావించవద్దని, ప్రభుత్వ వైఖరి కారణంగానే తాము మళ్లీ రోడ్డెక్కాల్సి వస్తోందని హెచ్చరించింది. ఆగస్టు 18న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదని సీజేపీ గుర్తుచేసింది. దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల జాబితాను అందిస్తే, వాటిని రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని కోర్టు పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదని తెలిపింది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి లిఖితపూర్వక హామీ అందలేదని వివరించింది. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు శాంతియుతంగా, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీజేపీ విజ్ఞప్తి చేసింది. "ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి" అనేదే తమ ప్రధాన డిమాండ్ అని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.